క్లుప్తంగా

11 నుంచి ఓపెన్ డిగ్రీ పరీక్షలు

కొల్లాపూర్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు సెమిస్టర్‌ల వారీగా ఈనెల 11వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని కొల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లేశం, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ రామరాజుయాదవ్‌లు వెల్లడించారు. ఈనెల 11 నుంచి ఫస్ట్ సెమిస్టర్, 26 నుంచి మూడో సెమిస్టర్, 27 నుంచి ఐదో సెమిస్టర్ విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు ఐడీ కార్డులు కూడా తీసుకురావాలని సూచించారు.

81 కార్నర్ మీటింగ్‌లు

కందనూలు: ఈనెల 10 నుంచి 25 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే 11 వేల కార్నర్ మీటింగులలో భాగంగా నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో 81కిపైగా కార్నర్ మీటింగులు నిర్వహిస్తున్నట్లు బీజేపీ సీనియర్ నాయకుడు, శక్తికేంద్ర ప్రముఖ్ సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాన్ని 10న శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ కూడలిల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, జిల్లా ఇన్‌చార్జ్ కొల్లి మాధవి, అసెంబ్లీ ఇన్‌చార్జి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దిలీపాచారి, జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు పాల్గొంటారని తెలిపారు.

సామాన్యులను దోచుకోవడం సరికాదు

అచ్చంపేట రూరల్: జీఎస్టీ పేరుతో సామాన్యులను దోచుకోవడం సరైంది కాదని మాలల చైతన్య సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మూలె కేశవులు అన్నారు. గురువారం మండలంలోని పులిజాలలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఉత్తరయ్య, అధ్యక్షుడిగా లక్ష్మయ్య, ఉపాధ్యక్షులుగా రామస్వామి, ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా ఆంజనేయులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటస్వామి, విష్ణు, తిరుపతయ్య, చెన్నకేశవులు, ఎల్లస్వామి, వెంకటయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

బేస్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

బిజినేపల్లి: ఆర్‌ఏహెచ్–యాక్ట్ పథకంలో భాగంగా వసంతాపూర్, లింగసానిపల్లి గ్రామాల్లోని బేస్‌లైన్‌లో నమోదు కానీ రైతులు దరఖాస్తులు చేసుకోవాలని డీఏఓ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం మండలంలోని లింగసానిపల్లి, వసంతాపూర్ గ్రామాల్లోని రైతులకు ఆర్‌ఏహెచ్–యాక్ట్ పథకం, బేస్‌లైన్ సర్వే గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ బేస్‌లైన్ సర్వేలో నమోదు కానీ రైతులు దరఖాస్తు చేసిన తర్వాత వారికి పథకంలోని 8 ప్యాకేజీల కింద జరిగే లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ రమేష్‌బాబు, ఏవో నీతి, ఏఈఓ కిషోర్, హేమ, రైతులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కోడేరు: మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఎన్వీ ఫౌండేషన్ చైర్మన్ నక్క వేణుగోపాల్‌యాదవ్ 80మందికి జనరల్ స్టడీస్ మెటీరియల్ బుక్కులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖర్‌గౌడ్, శివారెడ్డి, అంజల్‌గౌడ్ పాల్గొన్నారు.

గ్రామ దేవతలను పూజించాలి

అచ్చంపేట రూరల్: ప్రతి ఒక్కరూ గ్రామ దేవతలను పూజించాలని, పల్లె సాంప్రదాయాలను పాటించాలని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు కోరారు. గురువారం మండలంలోని మన్నెవారిపల్లిలో నిర్వహించిన గ్రామ దేవత బొడ్రాయి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆయా దేవాలయాలు, నూతనంగా ప్రతిష్టించిన బొడ్రాయి వద్ద ప్రభుత్వ విప్ బాలరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ టాలెంట్ టెస్టును జయప్రదం చేయండి

అచ్చంపేట రూరల్: విద్యార్థుల్లో పరీక్షలంటే భయాన్ని పోగొట్టేందుకు ఈనెల 12న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే ఎస్సెస్సీ టాలెంట్ టెస్టును జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తారాసింగ్ కోరారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో టాలెంట్ టెస్టు కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, హరికుమార్, క్రాంతి, మహేష్, హన్మంత్ పాల్గొన్నారు.

మదనగోపాలస్వామిని దర్శించుకున్న డీఎస్పీ

పెంట్లవెల్లి: మండల పరిధిలోని జటప్రోల్‌లో శ్రీమదనగోపాలస్వామి ఆలయాన్ని నాగర్‌కర్నూల్ డీఎస్పీ మోహన్ కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. ఈ మేరకు ఆయనకు సర్పంచ్ ఎస్‌కె ఖాజా ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో, పూలమాలలతో సన్మానించారు. అనంతరం ఎంతో పురాతనమైన ఆలయ చరిత్రను తెలియజేశారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ చంద్రయ్య, సుల్తాన్ పాల్గొన్నారు.

‘రైతుబంధు’ ఇవ్వకుండా వేధింపులు



పెద్దకార్పాముల పంజాబ్ నేషనల్ బ్యాంకు

పెద్దకొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద మంజూరు చేసిన రైతుబంధు డబ్బులను పెద్దకార్పాముల పంజాబ్ నేషనల్ బ్యాంకు అధికారులు రైతులకు ఇవ్వకుండా బ్యాంకు రుణాల కింద జమ చేసుకుంటున్నారని దేదినేనిపల్లి రైతులు వెంకటస్వామి, ప్రభావతమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఒక వైపు రైతులకు పెట్టుబడి కోసం అందించిన రైతుబంధును బ్యాంకు వారు నిలుపుదల చేయకుండా ఇవ్వాలని చెప్పినా బ్యాంకు అధికారులు ప్రభుత్వం మాటను పెడచెవిన పెట్టి రైతుల వద్ద ఖాతాల్లో జమయిన రైతుబంధును బ్యాంకు రుణాల కింద జమ చేసుకుంటున్నారు. మండల కేంద్రంలోని ఏపీజీవీ బ్యాంకు, కల్వకోలులోని ఏపీజీవీ బ్యాంకు కూడా ఇదే విధంగా రైతులకు రైతుబంధు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంకులో పంట రుణాల కింద దాదాపు రూ.10 కోట్లను 6 వేల మంది రైతులకు ఇచ్చారు. అదేవిధంగా మండల కేంద్రంలోని ఏపీజీవీ బ్యాంకులో కూడా రూ.8 కోట్లను 5 వేల మంది రైతులకు పంట రుణాలు ఇచ్చారు. కల్వకోలు బ్యాంకులో కూడా రూ.9 కోట్లను 4,800 మందికి పంట రుణాలను ఇచ్చారు. రైతుబంధు డబ్బులు, పంట రుణాల వడ్డీకి పట్టుకోకుండా రైతులకు నేరుగా చెల్లించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై బ్యాంకు మేనేజర్ అనిల్‌బాబు వివరణ కోరగా .. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసిన రైతుబంధు డబ్బులను పట్టుకోవడం లేదన్నారు. మొండి బకాయి ఉన్న రైతుల బ్యాంకు ఖాతాల్లోనే జమయిన రైతుబంధు డబ్బులను ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరిగినట్లు సమాధానం ఇచ్చారు.

రూ.25వేలు పట్టుకున్నారు



పంజాబ్ నేషనల్ బ్యాంకు అధికారులు యాసంగిలో రైతుబంధు కోసం ప్రభుత్వం బ్యాంకు ఖాతాలో జమ చేసింది. అయితే రూ.25వేలను లక్ష పంట రుణం వడ్డీ కింద పట్టుకున్నారు.

– ప్రభావతమ్మ, రైతు, దేదినేనిపల్లి

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంపీపీ శ్రీదేవి

తాడూరు: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో ప్రతిభ కనబర్చాలని ఎంపీపీ శ్రీదేవి అన్నారు. గురువారం మండల కేంద్రంలో విద్యుత్ బల్బు ఆవిష్కర్త థామస్ అల్వా ఎడిసన్ జయంతిని పురస్కరించుకుని విద్యుత్ వినియోగం పొదుపుపై బలాన్‌పల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన 5 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. అనంతరం బిల్లకంటి సాయిలత సౌజన్యంతో బహుమతులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రకాశ్, ఉపాధ్యాయులు కె.ఆంజనేయులు, శివకుమార్, సురేశ్‌కుమార్, పరమేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

‘సేవాలాల్’ కమిటీ ఎన్నిక

కొల్లాపూర్: సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల నిర్వహణ కోసం గురువారం కొల్లాపూర్‌లో గిరిజన సంఘం నాయకులు కమిటీని ఎన్నుకున్నారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడు కిషన్ నాయక్, ఎంపీపీ బోజ్యానాయక్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గిరిజన నాయకులు సమావేశమయ్యారు. ఈనెల 22న కొల్లాపూర్‌లోని గిరిజన భవన్‌లో సేవాలాల్ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. సమావేశంలో గిరిజన సంఘం నాయకులు చంద్రశేఖర్‌నాయక్, అశోక్, గోవిందు, గోపాల్, శంకర్‌నాయక్, దశరథం, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాల నాణ్యతపై పాడి రైతులకు అవగాహన

కల్వకుర్తిరూరల్: జిల్లాలోని పాడి రైతులు పాల నాణ్యత పెంచేందుకు కృషి చేయాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పాల పరిధి ఉపసంచాలకులు కవిత కోరారు. గురువారం పట్టణంలోని పాలశీతలీకరణ కేంద్రంలో పాల ఉత్పత్తి, పాల నాణ్యతపై పాడి రైతులకు, సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె పాల ఉత్పత్తికి తీసుకోవాల్సిన చర్యలపై పాడి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా అధికారి సత్యనారాయణ యాదవ్, కల్వకుర్తి మేనేజర్ యాసన్న, కల్వకుర్తి మిల్క్ చిల్లింగ్ సెంటర్ అధ్యక్షుడు శ్రీనివాసులు, పాడి రైతులు, రవాణాదారులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఏఎస్ఐ నాగేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొమ్మన్‌పల్లికి చెందిన రమేష్ పల్కపల్లికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో అచ్చంపేటలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుడు బాలస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలి


కేజీబీవీలో ఓటు అభ్యర్థిస్తున్న భుజంగరావు

అమ్రాబాద్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఎమ్మెల్సీ అభ్యర్థి భుజంగరావు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం అమ్రాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదర కేజీబీవీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులను ఓటు అభ్యర్థించారు. ఆయన వెంట రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు సుదర్శన్, కొత్త శ్రీధర్‌రావు, సతీష్, మండల అధ్యక్షుడు రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థిని అదృశ్యం.. కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని తాడూరుకి చెందిన ఇంటర్ విద్యార్థిని (17) అదృశ్యంపై గురువారం బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు. అచ్చంపేట ప్రభుత్వ బాలికల కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతుందన్నారు. ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం బర్త్‌డే కేక్ తెచ్చుకుంటామని అచ్చంపేటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు. అయితే కూతురు అదృశ్యంపై గ్రామానికి చెందిన బొడ్డుపల్లి రమేష్‌పై అనుమానం వ్యక్తంచేస్తూ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ రామ్మోహన్

మన్ననూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూలీల కోసం కల్పిస్తున్న ఉపాధి హామీ పనులను గ్రామీణ ప్రాంత కూలీలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రామ్మోహన్ సూచించారు. గురువారం అమ్రాబాద్ మండలం తుర్కపల్లిలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న ఫీడర్ ఛానల్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామాల్లోని కూలీలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి విష్ణు, ఫీల్డు అసిస్టెంట్లు ఆంజనేయులు, విజయ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

తెలకపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని చిన్నముద్దునూరుకి చెందిన రాములు బైక్‌పై గురువారం రాత్రి గ్రామానికి వస్తుండగా అనంతసాగర్ గేటు వద్ద గుర్తు తెలియని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఉన్న వారు ఆయనను నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కి తరలించినట్లు వైద్యులు తెలిపారు.

ఘనంగా ఖాదర్‌బాష దర్గా ఉర్సు


దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: పట్టణంలో ఖాదర్‌బాష దర్గా ఉర్సు ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో దర్గాను దర్శించుకుని, ఫాతేహాలు సమర్పించారు. జామెమజీద్ ఆఫీసాహెబ్ ఆరీఫ్‌షుత్తారీ దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాత్రి దర్గా వద్ద ఖవ్వాలీ ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ నాయకులు చింతలపల్లి జగదీశ్వర్‌రావు, ఎన్వీ ఫౌండేషన్ నిర్వాహకులు వేణుగోపాల్‌యాదవ్‌లు దర్గాను దర్శించుకుని, ప్రార్థనలు చేశారు. వారి వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

అచ్చంపేట రూరల్: కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డి మేస్తున్న ఓ ఆవు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన మండలంలోని ఐనోల్‌లో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కావటి రాములుకు చెందిన ఆవు గడ్డి మేసుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. పశుసంవర్ధక శాఖ అధికారులకు విషయం చెప్పడంతో అక్కడికి వచ్చి పంచనామా నిర్వహించారు.

బహుజన సమాజ్ పార్టీని బలోపేతం చేయాలి

కోడేరు: బహుజన సమాజ్ పార్టీని బలోపేతం చేయాలని కొల్లాపూర్ అసెంబ్లీ అధ్యక్షుడు కదిరెపాడు కృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన సమాజ్ పార్టీని గ్రామాల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయాలన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై కార్యక్రమాలు నిర్వహించాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దర్గస్వామి, ఉపాధ్యక్షుడిగా రాము, ఆది దానయ్య, ప్రధానకార్యదర్శిగా రాజు, విక్రమ్, ఆర్గనైజర్ సెక్రటరీగా రాజేష్, సెక్రటరీగా శివలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తాలూకా కన్వీనర్ శంకర్, నాగరాజు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కంటివైద్య శిబిరం

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ భవన్‌లో గురువారం నిర్వహించిన కంటి వైద్య శిబిరం విజయవంతంగా ముగిసిందని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య శిబిరంలో 45 మంది విశ్రాంత ఉద్యోగులకు పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరం ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు లక్ష్మణస్వామి, యుగంధర్‌రెడ్డి, వెంకటశెట్టి, చెన్నయ్య పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

లింగాల: మండల పరిధిలోని కొత్తచెర్వుతండా, శాయిన్‌పేట పాఠశాలలను గురువారం మండల నోడల్ అధికారి బి.శేఖర్ తనిఖీ చేశారు. ఎఫ్ఎల్ఎన్ పర్యవేక్షణలో భాగంగా పాఠశాలలను సందర్శించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలకు సంబంధించి ఎఫ్ఎల్ఎన్ రికార్డులను, తరగతి బోధనలను పరిశీలించిన ఆయన ఉపాధ్యాయులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శివకుమార్, చందూనాయక్, సీఆర్పీ హరిలాల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

తాడూరు: మండలంలోని సిర్సవాడ పాఠశాల విద్యార్థులకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆరోగ్య ఉపకేంద్రం, గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవనం, వివిధ కార్యాలయాలకు విద్యార్థులను తీసుకెళ్లి సిబ్బంది విధులు, గ్రామపంచాయతీ, ఆరోగ్య ఉపకేంద్రం విధులు తదితర విషయాలు ప్రజలకు ఎలా ఉపయోగపడుతాయనే అంశాలపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు.

పాఠశాలల పరిశీలన



తాడూరు: మండలంలోని సిర్సవాడ, ఐతోలు గ్రామాల పాఠశాలలను కాంప్లెక్స్ చైర్మన్ తిరుపతయ్య ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని వివిధ రికార్డులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లు పరిశీలించి తరగతి గదిలో బోధన, ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న విషయాలను తరగతి గదిలో విద్యార్థులకు అందే విధంగా చూడాలన్నారు. అనంతరం వివిధ అంశాలకు సంబంధించిన విషయాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

ఘనంగా బీరప్ప ఉత్సవాలు

తెలకపల్లి: మండల కేంద్రంలో బీరప్ప పండుగలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మండలంలోని మేకల వంశస్తులైన కురువ కులస్తులు గత 4 రోజుల నుంచి బీరప్ప ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం పెద్ద ఎత్తున మహిళలు బోనాలను అలంకరించుకుని తీసుకెళ్లారు.

గ్రామాభివృద్ధికి కృషి

కల్వకుర్తిరూరల్: గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు మండలంలోని తాండ్ర గ్రామ సర్పంచ్ సుశీల ఈశ్వరయ్య చెప్పారు. గురువారం మండలంలోని తాండ్రలో రోడ్ల నిర్మాణ పనులను చేపట్టారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మునెమ్మ, వాసగూడ మల్లేశ్, మల్లయ్య, లక్ష్మణ్, రమేశ్, బాలీశ్వర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు


బండలాగుతున్న వృషభ రాజులు

బిజినేపల్లి: ఆనందగిరి శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న బండలాగుడు పోటీలు రెండో రోజు రసవత్తరంగా కొనసాగాయి. మండల కేంద్రంలో సంత రోజు కావడంతో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. పోటీల్లో ఆరు పళ్ల విభాగం విజేతలను సర్పంచ్ బాలీశ్వర్ ప్రకటించారు. గురువారం నిర్వహించిన ఈ పోటీల్లో కర్నూల్ జిల్లా నుంచి భక్తులు మనోహర్ యాదవ్, రాములు, రామాంజనేయులు, గద్వాల జిల్లా నుంచి నరేంద్ర, కోండేరు రాజు, బుల్సపల్లె భీంరెడ్డి, నాగర్‌కర్నూల్ నుంచి రాంచంద్రారెడ్డి, కర్ణాటక నుంచి గొంది బారన్న, అమరవాయి నుంచి నరసింహులు, తదితరులు తమ వృషభ రాజులతో పాల్గొన్నట్లు ఉప సర్పంచు మిద్దె రాములు వివరించారు. శుక్రవారం సైతం పోటీలు ఉంటాయని, ఇతర రాష్ట్రాల నుంచి ప్రత్యేకంగా వృషభరాజులు రానున్నట్లు తెలిపారు.

అడవిలో మంటల నివారణపై అవగాహన


మాట్లాడుతున్న ఎఫ్ఆర్ఓ ప్రభాకర్

మన్ననూర్: అడవిలో మంటలు నివారణకు సంబంధించి గ్రామీణ ప్రజల భాగస్వామ్యంపై ఎఫ్ఆర్ఓ ప్రభాకర్ స్థానిక గిరిజన ఉన్నత పాఠశాల విద్యార్థులకు వివరించారు. గురువారం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అడవులు వాటి సంరక్షణ తదితర విషయాలను విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా అడవి మంటలు–నివారణ విద్యార్థుల పాత్రపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అమ్రాబాద్ ఫారెస్టు రేంజ్ డీఆర్ఓ లక్ష్మీకాంత్, హెచ్‌ఎం దశరథం, ఎఫ్ఎస్ఓలు స్వప్న, పర్వతాలు, బీఎఫ్ఓలు హన్మంత్ నాయక్, జ్యోస్న ఉపాధ్యాయులు స్వామిలాల్, మోతీలాల్, సూర్య, పీఈటీ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

రాచూర్‌లో శివస్వాముల పడిపూజ

వెల్దండ: మండల పరిధిలోని రాచూర్‌లో గురువారం రమేష్ గురుస్వామి ఇంట్లో శివస్వాములు పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. శివనామస్మరణంతో ఆట పాటలతో మార్మోగించారు. ప్రతి ఏడాది స్వామిమాల ధరించి ఇరుముడులతో శ్రీశైలం బయలుదేరుతామన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు నాగయ్య, తిరుపతయ్య, స్వాములు నరేష్‌గౌడు, వెంకటేష్, నాని తదితరులు ఉన్నారు.

తండాల అభివృద్ధి మరిచిన ప్రభుత్వం


గిరిజనులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు జగదీశ్వర్‌రావు

పెద్దకొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం తండా అభివృద్ధిని మరిచి సంక్షేమ పథకాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమవుతోందని కొల్లాపూర్ కాంగ్రెస్ నాయకుడు జగదీశ్వర్‌రావు అన్నారు. చంద్రబండతండా, మారేడుమాన్‌దిన్నె తండాలలో గురువారం పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొత్త గ్రామపంచాయతీగా ఏర్పాటైన చంద్రబండ తండాలో మౌలిక వసతులు గ్రామపంచాయతీ, పాఠశాల, దేవాలయాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన అన్నారు. అదే విధంగా డబుల్ బెడ్రూం ఇళ్లు లేకపోవడంతో గిరిజనులు భవిష్యత్‌లో ఇబ్బందులు పడుతారని అన్నారు. అసంపూర్తిగా ఉన్న రోడ్డును నిర్మాణం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే తండా ప్రజలకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, కుర్మయ్య, మురళీధర్‌రెడ్డి, పాష పాల్గొన్నారు.

అన్ని వార్డుల అభివృద్ధికి కృషి


సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్

అచ్చంపేట రూరల్: పట్టణంలోని అన్ని వార్డుల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని 9వ వార్డులోని ఆదర్శనగర్, మధురానగర్ కాలనీలో రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్‌తో కలిసి పర్యటించారు. కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు నిధుల నుంచి రూ. 50లక్షలు వార్డు అభివృద్ధికి కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రమేష్‌రావు, కాలనీవాసులు నారాయణ, మణెమ్మ, జగపతిరావు, తిరుపతిరావు, శ్రీరాంనాయక్, వేణుగోపాల్, సామ్యనాయక్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత.. కేసు నమోదు

వెల్దండ: మండల పరిధిలోని బైరాపూర్‌కి చెందిన డేరంగుల నిరంజన్ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తుంటే గురువారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు

అచ్చంపేట రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని అచ్చంపేట నుంచి శ్రీశైలం, ఉమామహేశ్వరం కొండపైకి, భౌరాపూర్ కల్యాణానికి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను నడుపనున్నామని ఆర్టీసీ డీఎం రాజశేఖర్ అన్నారు. గురువారం స్థానిక డిపోలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. భక్తుల రద్దీ దృష్ట్యా అచ్చంపేట నుంచి శ్రీశైలం వరకు 45 బస్సులను నడపాలని, ఉమామహేశ్వరం కొండపైకి, భౌరాపూర్‌లో నిర్వహించే కల్యాణానికి బస్సుల ఏర్పాటుపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు చంద్రయ్య, జేఆర్‌రెడ్డి, పీటీ కుమార్, నాగయ్య పాల్గొన్నారు.

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సింగోటంలో శివ స్వాములు ఏర్పాటు చేసిన మహాపడి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి కుటుంబసభ్యులతో పాల్గొని శివ పార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు.

రజకులకు అన్యాయం

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రజకులకు తీరని అన్యాయం చేశారని రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి ఆరోపించారు. గురువారం స్థానిక పట్టణంలో జిల్లా అధ్యక్షుడు గోవిందు బాలస్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రజకులకు కేటాయించిన రూ.59.70 కోట్ల బడ్జెట్ కేవలం ఉచిత విద్యుత్ కోసం కేటాయించారని, ఉపాధి కోసం కేటాయించాల్సిన రూ.500 కోట్ల బడ్జెట్‌ను కేటాయించకుండా రజకులకు మొండి చెయ్యి చూపించిందని విమర్శించారు. జిల్లా నూతన కమిటీ ఏర్పాటులో భాగంగా ఈ సమావేశం నిర్వహించారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా సావరాజు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడిగా సుంకరి బాలకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సింగరాజుల ఆంజనేయులు, కార్యదర్శిగా గుణశేఖర్, జిల్లా అధ్యక్షుడిగా గోవిందు బాలస్వామిలకు నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకటస్వామి, రాములు, శివ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ఉప్పునుంతల: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అచ్చంపేట ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌రావు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కన్వీనర్ కొండల్‌రెడ్డి, అచ్చంపేట అసెంబ్లీ కన్వీనర్ రేణయ్య అన్నారు. గురువారం మండలంలోని లక్ష్మాపూర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు రమేష్ అధ్యక్షతన నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. సమావేశంలో బీజేపీ నాయకులు శ్రీనునాయక్, స్మితారెడ్డి, జగన్‌గౌడ్, బాల్‌రెడ్డి, బ్రహ్మచారీ, సురేందర్‌రెడ్డి, బాలగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనాల పరిశీలన

తాడూరు: మండలంలోని ఇంద్రకల్, లచ్చిరాంతండా గ్రామపంచాయతీలలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలను ఎంపీడీఓ గంగమోహన్, ఎంపీఓ లక్ష్మణ్ నాయక్‌లు గురువారం పరిశీలించారు. ఆయన వెంట క్షేత్రసహాయకులు రాజేశ్ ఉన్నారు.

విద్యార్థికి ఘన సన్మానం

లింగాల: జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చిన మండల కేంద్రానికి చెందిన కె.తరుణ్‌ని గురువారం సామాజిక కార్యకర్త కాట్రావత్ రాంజీనాయక్ ఆధ్వర్యంలో బంజార సేవా సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఎలాంటి కోచింగ్ లేకుండా జేఈఈ మెయిన్స్‌లో మొదటి శ్రేణిలో స్కోర్ సాధించి ప్రతిభ కనబర్చడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో భోజ్యానాయక్, లక్ష్మణ్, లక్ష్మీనారాయణ, కిషన్‌నాయక్, శంకర్, గోపాల్, శ్రీను, రాంజీ, హన్మంత్ పాల్గొన్నారు.

కేవీపీఎస్ ధర్నాకు తరలిన నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: పేదలకు ఇళ్ల స్థలాలు ఉన్న వారికి రూ.5 లక్షలు, ఇళ్ల స్థలాలు లేని వారికి డబల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ కేవీపీఎస్ నాయకులు తరలివెళ్లారు. ఆ సంఘం నాయకులు కేతెపల్లి సత్యనారాయణ, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న , సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, ఐద్వా జిల్లా కార్యదర్శి కందికొండ గీత, నాయకులు పాదిల రామయ్య, కృష్ణ, రామాంజనేయులు, మహేశ్, హరికృష్ణ, శేఖర్, వెంకట్రాములు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.